

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 337 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 03, నవంబర్ 2025 | పేజీలు 5 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్











డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



తొలిసారి వరల్డ్ కప్ కైవసం

# చరిత్ర సృష్టించిన భారత మహిళల జట్టు!

- మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టు
- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ (87), దీప్తి శర్మ (58) హాఫ్ సెంచరీలు
- బౌలింగ్‌లో 5 వికెట్లతో దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించిన దీప్తి శర్మ
- సఫారీ కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) అద్భుత సెంచరీ వృథా
- భారత ఆల్‌రౌండర్ల ప్రదర్శనతో సొంతమైన ప్రపంచ టైటిల్

ముంబై, (జై భీమ్ డెస్క్)

భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. కోట్లాది మంది అభిమానుల ఆశలను నిజం చేస్తూ తొలిసారిగా ఐసీసీ మహిళల ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ అద్భుత ఇన్నింగ్స్‌కు, చివర్లో దీప్తి శర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శన తోడవడంతో భారత్ జగజ్జేతగా నిలిచింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ వీరోచిత సెంచరీ చేసినా, తన జట్టును గెలిపించలేకపోయింది. ఈ మెగా ఫైనల్‌లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్, ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఓపెనర్లు స్మృతి మంధన (45), షఫాలీ వర్మ (87) అద్భుతమైన శుభారంభం అందించారు. ముఖ్యంగా షఫాలీ తనదైన శైలిలో దూకుడుగా ఆడి కేవలం 78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేసి భారీ స్కోరుకు పునాది వేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం జెమీమా రోడ్రిగ్స్ (24), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (20) త్వరగానే వెనుదిరిగినా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (58) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. చివరి ఓవర్లలో వికెట్ కీపర్ రిచా ఘోష్ (24 బంతుల్లో 34) మెరుపులు మెరిపించడంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగుల భారీ స్కోరు సాధించింది. సఫారీ బౌలర్లలో అయాబొంగా ఖాకా 3 వికెట్లు పడగొట్టింది. 299 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అయితే, కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) ఒంటరి పోరాటం చేసింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా, ఆమె మాత్రం అద్భుతమైన షాట్లతో భారత బౌలర్లపై ఒత్తిడి

- మిగతా 2లో..



## ఈ విజయం దేశంలోని భవిష్యత్ ఛాంపియన్లకు ప్రేరణ: ప్రధాని మోదీ

ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్ 2025 ఫైనల్స్‌లో టీమిండియా విజయం

భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ

అద్భుతమైన నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో ఆడారని ప్రశంస

టోర్నీ అంతటా అసాధారణమైన జట్టు స్ఫూర్తి కనబరిచారని కొనియాడిన ప్రధాని

ఈ చారిత్రక గెలుపు భవిష్యత్ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని వ్యాఖ్య

2

## రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం... 18 మంది దుర్మరణం

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టిన యాత్రికుల టెంపో ట్రావెలర్

ఈ దుర్ఘటనలో 18 మంది అక్కడికక్కడే మృతి

మరో ఆరుగురికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు

కొలాయత్ జాతర నుంచి తిరిగి వస్తుండగా ఘటన

ప్రమాదంపై రాజస్థాన్ ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

3





## దశాబ్దాల కల నెరవేరింది

భారత మహిళా క్రికెటర్లను కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి

ఐసీసీ మహిళల ప్రపంచకప్ 2025 గెలిచిన భారత జట్టు

టీమిండియాకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం సాధించిన భారత్

కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వాన్ని ప్రత్యేకంగా ప్రశంసించిన సీఎం : దేశం గర్విస్తోందని వ్యాఖ్య

క్రీడాకారుల పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమన్న రేవంత్ రెడ్డి

3

# వైద్యాధికారులు వారం రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలి

**డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్**



**వరంగల్, నవంబర్ 2(జై భీమ్ న్యూస్)**

వరద ప్రభావిత ప్రాంతాలలో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటూ వైద్యాధికారులు, సిబ్బంది వచ్చే వారం రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ డి. రవీంద్ర నాయక్ ఆదేశించారు. ఆదివారం ఆయన హనుమకొండ, వరంగల్ జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. డాక్టర్ ఏ. అప్పయ్య, డాక్టర్ బి. సాంబశివరావు లతో కలిసి బ్రిందావన్ కాలనీ, ఎన్టీఆర్ నగర్ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంజిఎం వైద్యాధికారి డాక్టర్ అర్చన వద్ద నుండి గత మూడు రోజులుగా నిర్వహించిన ఇంటింటి సర్వే వివరాలు, వైద్య శిబిరాల పరిస్థితి, చికిత్స నిమిత్తం వచ్చే రోగుల వివరాలు తదితర అంశాలను తెలుసుకున్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ ః నీరు నిల్వ ఉండడం, ఆహార పదార్థాలు కలుషితం కావడం వంటి పరిస్థితుల్లో డయేరియా, డీసెంట్రీ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. కాబట్టి వారం రోజులపాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు చికిత్స అందించాలి. అవసరమైన వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయాలి," అని సూచించారు. అదే విధంగా కలుషిత నీరు, ఆహార పదార్థాల ద్వారా వ్యాధులు రాకుండా ప్రజలకు త్రాగునీరు, ఆహారం విషయంలో జాగ్రత్తలు వివరించాలని చెప్పారు. తరువాత హనుమకొండ డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది కార్పొరేషన్ అధికారులతో సమన్వయంగా పనిచేయాలని, లార్వా నివారణ చర్యలు, ఫాగింగ్ కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రోగ్రాం అధికారులు క్షేత్రస్థాయిలో గృహ సర్వే, వైద్య శిబిరాల నిర్వహణ, పర్యవేక్షణ పనుల్లో సమన్వయం కాగలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో వరంగల్ డిఎంహెచ్ఓ డాక్టర్ బి. సాంబశివరావు, హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య, అదనపు డిఎంహెచ్వో డాక్టర్ టి. మదన్మోహన్‌రావు, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ హిమబిందు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇక్తదార్ అహ్మద్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ మంజుల, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, వరంగల్ డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఉదయరాజ్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ విగ్రహానికి మాలధారణ



**హన్మకొండ, నవంబర్ 2 (జైభీమ్ న్యూస్)**

కాజీపేట బోడగుట్టలోని భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి ప్రతి నెల మొదటి ఆదివారం మాలధారణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని బోడగుట్ట అంబేద్కర్ మాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ పుచ్చ లక్ష్మినారాయణ (ఎం.డి), గ్రేటర్ వరంగల్ మాల మహానాడు అధ్యక్షుడు అంకెశ్వరపు రామచందర్ రావు పాల్గొన్నారు. గుండాల సాధానందం, మాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మొదటగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళి అర్పించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ః డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల కోసం, మహిళల కోసం రాజ్యాంగంలో హక్కులను కల్పించారు. ఆయన చూపిన మార్గంలో నడిచి మనకు రావలసిన హక్కులను సాధించేందుకు ప్రభుత్వాలను నిలదీయడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు. బోడగుట్ట వాసులు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కుమార్, యాదగిరి, శేఖర్ బాబు, శివకృష్ణ, ఎల్లేశ్వర్ రావు, రోహిత్, రాయుడు, విజయ, స్వప్న, సుహాసిని, వసంత, ఝాన్సీ, పుష్ప, రాజు, శ్యామ్, ఎల్లస్వామి, శేఖర్, భాను, పృధ్వి, బోడగుట్ట పెద్దమనిషి రామిండ్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బాలికల మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్





**సంగెం, నవంబర్ 2 (జైభీమ్ న్యూస్)**

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం సంగెం మండలంలోని గవిచర్లలో గల తెలంగాణ బాలికల మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూం లను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రత, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను గమనించారు. బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యత, సరుకుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ తాజా కూరగాయలనే వాడాలి. ఈగలు, దోమల బెడద లేకుండా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. మెనూ పట్టికను పరిశీలించిన ఆమె, విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఏమైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదుల పెట్టెలో తమ అభిప్రాయాలు, అవసరాలు రాయాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో అవసరమైన సదుపాయాల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ వెంటనే అధికారులను తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డిబిసిడిఓ పుష్పలత, తహసీల్దార్ రాజ్ కుమార్, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర సృష్టించిన భారత మహిళల జట్టు !

మొదటి పేజీ తరువాయి పెంచింది. కేవలం 98 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే, మిగతా బ్యాటర్ల నుంచి ఆమెకు సరైన సహకారం అందలేదు. సఫారీ ఇన్నింగ్స్‌లో అనెరీ డెర్క్‌సెన్ (35) మినహా ఎవరూ రాణించలేకపోయారు. ఈ దశలో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బంతితో మ్యాజిక్ చేసింది. కీలకమైన వోల్వార్ట్ వికెట్‌తో సహా మొత్తం 5 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించింది. ఆమె అద్భుతమైన బౌలింగ్‌కు సఫారీ బ్యాటర్లు నిలవలేకపోయారు. దీప్తికి తోడుగా షఫాలీ వర్మ కూడా 2 కీలక వికెట్లు తీసి తన ఆల్‌రౌండ్ సత్తాను చాటింది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 45.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా భారత అమ్మాయిలు 52 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుని ప్రపంచకప్‌ను గర్వంగా ముద్దాడారు. 2005, 2017 వన్డే వరల్డ్ కప్ లలో టీమిండియా అమ్మాయిలు ఫైనల్ చేరినా, కప్ దక్కించుకోలేకపోయారు. ఇప్పుడా లోటును తీర్చుతూ, చారిత్రక విజయం నమోదు చేశారు.

## ఈ విజయం దేశంలోని భవిష్యత్ ఛాంపియన్లకు ప్రేరణ: ప్రధాని మోదీ

**ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్ 2025 ఫైనల్స్‌లో టీమిండియా విజయం**

**భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ**

**అద్భుతమైన నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో ఆడారని ప్రశంస**

**టోర్నీ అంతటా అసాధారణమైన జట్టు స్ఫూర్తి కనబరిచారని కొనియాడిన ప్రధాని**

**ఈ చారిత్రక గెలుపు భవిష్యత్ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని వ్యాఖ్య**

ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్ 2025 ఫైనల్స్‌లో అద్భుత విజయం సాధించిన భారత జట్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఫైనల్‌లో భారత క్రీడాకారిణుల ప్రదర్శన అత్యుత్తమ నైపుణ్యం, గొప్ప ఆత్మవిశ్వాసంతో నిండి ఉందని ఆయన కొనియాడారు. ఈ చారిత్రక విజయంపై ప్రధాని స్పందిస్తూ, "టోర్నమెంట్ ఆద్యంతం మన జట్టు అసాధారణమైన టీమ్‌వర్క్, పట్టుదలను ప్రదర్శించింది. మన క్రీడాకారిణులకు నా అభినందనలు" అని పేర్కొన్నారు. భారత మహిళల జట్టు కనబరిచిన స్ఫూర్తిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ గెలుపు కేవలం ఒక ట్రోఫీ మాత్రమే కాదని, దేశంలోని భవిష్యత్ ఛాంపియన్లకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. "ఈ చారిత్రక విజయం, క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడానికి యువతను మరింత ప్రోత్సహిస్తుంది" అని ఆయన అన్నారు. భారత జట్టు సాధించిన ఈ అద్భుతమైన విజయం దేశానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

## నష్టపోయిన పంటల వివరాలను త్వరగా అంచనా చేసి నివేదికను సమర్పించాలి

**కలెక్టర్ స్నేహ శబరీష్**

**వరద ముంపుతో వంగపహాడ్ పరిధిలో దెబ్బతిన్న వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**



**హన్మకొండ, నవంబర్ 2(జై భీమ్ న్యూస్)**

మొంథా తుఫాను ప్రభావంతో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటల వివరాలను త్వరగా అంచనా వేసి నివేదికను సమర్పించాలంటూ హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె హసన్‌పర్తి మండలం వంగపహాడ్ రెవెన్యూ గ్రామ పరిధిలో వరద ముంపుతో దెబ్బతిన్న వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక రైతులను పరామర్శించి, వరద ప్రభావంతో జరిగిన నష్టాన్ని వివరంగా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ః పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది. నష్టం వివరాలను సత్వరంగా ప్రభుత్వానికి నివేదించి, పరిహారం అందేలా చర్యలు చేపడతాం అని తెలిపారు. అదే విధంగా వ్యవసాయ అధికారులకు సూచిస్తూ ః ప్రతి గ్రామంలో సర్వే నంబర్ల వారీగా పంట నష్టాన్ని అంచనా వేసి, నివేదికను తక్షణం అందజేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి, పంటల స్థితిగతులను నిర్ధారించాలి," అని ఆదేశించారు.. తరువాత బైరాన్‌పల్లి %-% వంగపహాడ్ గ్రామాల మధ్య వరద ధాటికి దెబ్బతిన్న రహదారిని కలెక్టర్ పరిశీలించారు. రాకపోకలు సక్రమంగా కొనసాగేందుకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏడిఏ ఆదిరెడ్డి, ఏఓ అనురాధ, ఏఈఓ అనూషతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.



## గోపాల్‌పూర్ ఊర చెరువు కట్ట మరమ్మతులు పూర్తి



**హన్మకొండ, నవంబర్ 2( జై భీమ్ న్యూస్)**

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా హనుమకొండ గోపాల్‌పూర్ ఊర చెరువులోకి ఎగువ ప్రాంతాల నుండి పెద్దఎత్తున వరదనీరు చేరి చెరువుకట్ట తెగిపోయిన ఘటనలో, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు సాగునీటిపారుదల శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఆదివారంతో మరమ్మతు పనులు పూర్తయ్యాయి. అక్టోబర్ 29న తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో చెరువులోకి సామర్థ్యానికి మించి నీరు చేరడంతో చెరువు కట్ట తెగిపోయి, కిందనున్న వివేక్‌నగర్, అమరావతినగర్, సమ్మయ్యనగర్ తదితర కాలనీలు ముంపునకు గురయ్యాయి. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, చెరువు కట్ట పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల మేరకు సాగునీటిపారుదల శాఖ అధికారులు మట్టి, ఇసుక బస్తాలతో చెరువు కట్ట పూడ్చి, వరదనీరు దిగువ ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం చెరువు కట్టకు పూర్తిస్థాయి మరమ్మతులు పూర్తి చేశారు. మరమ్మత్తు పనులను సాగునీటిపారుదల శాఖ డిఈఈ కిరణ్ కుమార్, డిఈ హర్షవర్ధన్, ఏఈ నజ్మా ఖానం పర్యవేక్షించారు. అధికారులు?? పర్యటనలు నిర్వహిస్తూ పనులు సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు.



# ఆసుపత్రుల నుంచి క్షతగాత్రుల డిశ్చార్జి

**పలాస సిహెచ్ సిలో 11 మందికి కొనసాగుతున్న చికిత్స**
**మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

**అమరావతి, జైభీమ్ న్యూస్**

శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో గాయపడి చికిత్స అనంతరం కోలుకున్న వారిని ఇళ్లకు పంపుతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. క్షతగాత్రులకు అందిస్తున్న వైద్యంపై ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ సమీక్షించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'పలాస కిడ్నీ రీసెర్చి సెంటర్ అండ్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ లో చికిత్స కోసం శనివారం చేరిన వారికి వైద్యులు ఉత్తమ సేవలు అందించారు. ఎక్స్ రేలు, ఇతర పరీక్షలు చేసిన అనంతరం వారికి అందించిన చికిత్సతో పూర్తిగా కోలుకున్న 15 మందిని వైద్యులు ఇళ్లకు పంపించారు. పలాస సామాజిక ఆసుపత్రి(%జఎజ%)లో ప్రస్తుతం 11 మంది చికిత్స పొందుతున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్సతో బాగా కోలుకుంటున్న వీరిలో ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన వారు మూడు రోజుల్లోగా డిశ్చార్జి అయ్యే అవకాశం ఉంది. వీరికి చికిత్స అందించే విషయంలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు" అని మంత్రి తెలిపారు. పలాస సీహెచ్సీలో చికిత్స పొందుతున్న వారిలో ఒకరిని ఆదివారం శస్త్రచికిత్స నిమిత్తం శ్రీకాకుళం లోని జెమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

# దశాబ్దాల కల నెరవేరింది

**భారత మహిళా క్రికెటర్లను కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి**
**ఐసీసీ మహిళల ప్రపంచకప్ 2025 గెలిచిన భారత జట్టు**
**టీమిండియాకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి**
**ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం సాధించిన భారత్**
**కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వాన్ని ప్రత్యేకంగా ప్రశంసించిన సీఎం**
**దేశం గర్విస్తోందని వ్యాఖ్య**
**క్రీడాకారుల పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమన్న రేవంత్ రెడ్డి**

**జై భీమ్ న్యూస్, హైదరాబాద్**

ఐసీసీ మహిళల ప్రపంచకప్-2025 ఫైనల్‌లో చారిత్రక విజయం సాధించిన భారత మహిళల క్రికెట్ జట్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఉత్కంఠభరితమైన తుది పోరులో అద్భుత ప్రదర్శన కనబరిచి, ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను కైవసం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారత క్రీడాకారిణులు ప్రదర్శించిన మొక్కవోని పట్టుదల, ధైర్యసాహసాలు, అంకితభావం ప్రశంసనీయమని కొనియాడారు. జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వ పటిమను, ఫైనల్‌లో జట్టు కనబరిచిన అత్యుత్తమ ప్రదర్శనను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. "ఈ విజయంతో దశాబ్దాల కల నెరవేరింది. భారత మహిళా జట్టు సాధించిన ఈ అద్భుతమైన ఘనతకు యావత్ దేశం గర్విస్తోంది. మన క్రీడాకారిణులు ప్రదర్శించిన పోరాట పటిమ, క్రీడాస్ఫూర్తి దేశవ్యాప్తంగా వర్ధమాన క్రికెటర్లకు గొప్ప ఆదర్శంగా నిలుస్తుంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే ఉత్సాహం, ఐక్యత, ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తులో మన జట్టు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు భారత మహిళల జట్టుకు, బీసీసీఐకి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాజస్థాన్ లో ఘోర రోడ్డు ప్రమాదం... 18 మంది దుర్మరణం

**రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం**
**ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టిన యాత్రికుల టెంపో ట్రావెలర్**
**ఈ దుర్ఘటనలో 18 మంది అక్కడికక్కడే మృతి**
**మరో ఆరుగురికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు**
**కొలాయత్ జాతర నుంచి తిరిగి వస్తుండగా ఘటన**
**ప్రమాదంపై రాజస్థాన్ ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి**

**రాజస్థాన్, జై భీమ్ న్యూస్**

రాజస్థాన్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జోధ్‌పూర్ జిల్లాలో యాత్రికులతో వెళుతున్న ఓ టెంపో ట్రావెలర్, రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 18 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జోధ్‌పూర్‌లోని సుర్‌సాగర్ ప్రాంతానికి చెందిన కొందరు యాత్రికులు బికనీర్ జిల్లాలోని కొలాయత్ జాతరకు వెళ్లి టెంపో ట్రావెలర్‌లో తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఫలోడి సబ్-డివిజన్‌లోని మటోడా ప్రాంతం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో వాహనం అతివేగంతో ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. తెల్లవారుజామున వెలుతురు తక్కువగా ఉండటంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రక్కును గమనించలేకపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదం ఎంత తీవ్రంగా ఉందంటే, టెంపో ట్రావెలర్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. మృతులను గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ దుర్ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఫలోడిలోని మటోడా ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం అత్యంత విషాదకరం, హృదయ విదారకం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారందరికీ మెరుగైన చికిత్స అందించాలని జిల్లా పరిపాలన అధికారులను ఆదేశించాను. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు రెండు వాహనాలకు మెకానికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# పెద్దమ్మ తల్లి కళ్యాణ వార్షికోత్సవం

**హసన్ పర్తి పెద్దమ్మ తల్లి ఐదవ కళ్యాణ వార్షిక మహోత్సవము లోపాల్గొన్న. వరంగల్ పార్లమెంట్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కాంగ్రెస్ నాయకులు అద్భుతమైన, ఆహ్లాదకరమైన పవిత్ర దేవాలయంగ హసన్ పర్తి పెద్దమ్మ తల్లి గుడి**

**జై భీమ్ న్యూస్ (హన్మకొండ)**

గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రత్యేకంగా ఆహ్వానించిన హసన్ పర్తి మాజీ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు. పెద్దమ్మ నరసింహారాములు,ప్రస్తుత అధ్యక్షులు శీలం పృథ్వి రాజు,ముఖ్య అతిథిగా వరంగల్ పార్లమెంట్ ఎం.పీ డాక్టర్ కడియం కావ్య..వర్ధన్నపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వరంగల్ పార్లమెంట్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హసన్ పర్తి కాంగ్రెస్ లు ముదిరాజ్ సంఘం కమిటీ సభ్యులు..కులదైవం అయినా పెద్దమ్మతల్లి ఐదు రోజుల బ్రహ్మోత్సవాలు భాగంగా ఈరోజు గుడికి వెళ్లి సందర్శించడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్,పెద్దమ్మ రాం నర్సింలు మాట్లాడుతూ దేవాలయాలు హిందువులకు శాంతి మరియు విశ్వాసానికి చిహ్నం కార్తిక మాసంలో జరిగే అత్యంత పవిత్ర గల ఉత్సవాలుగా భావించారు గత 5 సంవత్సరాల నుండి ప్రతి ఏటా ముదిరాజ్ సంఘం కులదైవమైన పెద్దమ్మ తల్లికి కళ్యాణం జరిపించి బోనాలతో ఊరేగించి కులదైవంతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో. ఆరోగ్యాలతో ఉండాలని .ఈ దేవాలయాలము పూజలు మరియు నైవేద్యాలు సమర్పించడానికి వచ్చే




ప్రజలకు మరియు సందర్శకులకు నిత్య తెరిచి ఉంటాయి చెప్పారు ఎంపీ కడియం కావ్య గుడి అభివృద్ధికి కచ్చితంగా తోడ్పడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్. జన్ను రవీందర్. పుల్ల రవీందర్. పెద్దమ్మ నరసింహ రాములు. ఎల్.ఐ.సి. వెంకటేశ్వర్లు. వీసం సురేందర్ రెడ్డి వేల్పుల సంపత్ యాదవ్. గొర్రె కిరణ్ కుమార్ బిగుళ్ల సురేష్. పల్లెపు అనుష.వేల్పుల సాంబయ్య, వల్లాల గంగాధర్.ఎన్టీఆర్ మొగిలి గరిగే రాజు. ఆకుతోట రాజేందర్. సతీష్ మరియు ముదిరాజ్ కుల సంఘ పెద్దలు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## వివరాల నమోదును పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హన్మకొండ, నవంబర్ 2(జై భీమ్ న్యూస్)**

ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో హనుమకొండ నగరంలోని పలు కాలనీలు వరద ముంపునకు గురై, గృహాలు, సామగ్రి, ఇతర ఆస్తులకు నష్టం కలిగిన నేపథ్యంలో, సర్వే బృందాలు సేకరించిన వివరాల కంప్యూటరీకరణ పనులను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం పరిశీలించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డేటా ఎంట్రీ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్, ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. సర్వే బృందాలు సేకరించిన ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం సమగ్రంగా నమోదు చేయాలని, ఎటువంటి వివరాలు మిగలకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సేకరించిన డేటాను సోమవారం నాటికి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, కాజీపేట తహసీల్దార్ భావ్ సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాల వెన్నంటే ప్రభుత్వం.. మీ కోసం మేమున్నాం









**- బాధిత కుటుంబాలకు ధైర్యం నింపిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు**
**- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కేంద్ర%-%రాష్ట్ర మంత్రులు**
**- టెక్కలి నియోజకవర్గంలో మృతుల కుటుంబాలకు రూ. 15 లక్షల చొప్పున చెక్కుల అందజేత**
**- పలాస ఆసుపత్రిలో క్షతగాత్రులకు రూ. 3 లక్షల ఆర్థిక సాయం పంపిణీ**
**- సమగ్ర విచారణకు ప్రభుత్వం సిద్ధం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు- మంత్రి అచ్చెన్నాయుడు**

**అమరావతి/శ్రీకాకుళం, నవంబర్ 2 (జైభీమ్ న్యూస్)**

"మేమున్నాం మీకేం కాదని" అని భరోసా ఇచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రిల్స్ విరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలను పరామర్శించిన కేంద్ర%-%రాష్ట్ర మంత్రులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ధృవీకరించారు.ఆదివారం నాడు మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి బాధితుల నివాసాలకు వెళ్లి వారి దుఃఖంలో భాగమయ్యారు. కష్ట సమయంలో ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి చేస్తున్నదని, ప్రతి కుటుంబం వెన్నంటే నిలబడతామని హామీ ఇచ్చారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 15 లక్షల చెక్కులను మంత్రులు స్వయంగా అందజేశారు. టెక్కలి నియోజకవర్గానికి చెందిన ముగ్గురు బాధిత కుటుంబాలకు చెక్కులు అందించారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు రూ. 3 లక్షలు చొప్పున ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ ఘటనలో అనుకోని రద్దీ, ఆలయ నిర్వాహకుల తగిన ఏర్పాట్ల లోపం కారణమై ప్రమాదం సంభవించినట్లు అధికారులు వివరించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రైవేటు ఆలయం కావడంతో నిర్లక్ష్యం చోటుచేసుకుని ఉండొచ్చని, అయినప్పటికీ ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుని సమగ్ర విచారణ చేపడుతుందని స్పష్టం చేశారు. "ఈ దుర్ఘటనను రాజకీయాలకు అన్వయించడం సరికాదు. మానవ తప్పిదం కనిపించకపోయినా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి అన్నారు. "బాధితుల్లో ఎక్కువ మంది మహిళలు ఉండటం ఎంతో బాధాకరం. వారు ఎదుర్కొంటున్న పరిస్థితి మాటల్లో చెప్పలేనిది. కానీ ప్రభుత్వం మీ వెన్నంటే ఉంది. మీ కుటుంబాల పునరావాసం, అవసరమైన సహాయం అన్ని విధాలా అందిస్తాం. మీ కోసం మేమున్నాం అని మంత్రులు హామీ ఇచ్చారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు కొనసాగింపు

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**రామగుండం, నవంబర్ 2(జై భీమ్ న్యూస్)**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేని డ్రోన్ వినియోగం, భారీ డీజే సౌండ్ ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను మరో నెల పాటు పొడిగిస్తున్నట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రకటించారు. పోలీస్ కమిషనర్ వెల్లడించిన ప్రకారం, మంచిర్యాల మరియు పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసభ్య ప్రవర్తనకు పాల్పడుతున్న వ్యక్తులపై పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ప్రజల భద్రత, శాంతి భద్రతల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1, 2025 వరకు కొనసాగుతాయని స్పష్టం చేశారు. పరిస్థితుల ప్రభావం ఆధారంగా ఈ కాలాన్ని పొడిగించే అవకాశం ఉందన్నారు. నిషేధాలను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం 1348 ఫసలీ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..డీజే సౌండ్స్, డ్రోన్‌లపై కఠిన నిషేధం ప్రజా కార్యక్రమాలు, ప్రదర్శనల సందర్భంగా శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు భారీ డీజే సౌండ్స్ వినియోగంపై కూడా నిషేధం కొనసాగుతుందని సిపి తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులు, రోగులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తీసుకున్నప్పుడే మైక్ సెట్ వినియోగం అనుమతిస్తామని పేర్కొన్నారు. సిటీ పోలీస్ యాక్ట్ అమలు కొనసాగింపు అదేవిధంగా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ 7 (1), 2016, 22 (1)(ఏ) నుండి (ఎఫ్), 22 (2)(ఏ), (బి), 22 (3), సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం కూడా నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని చెప్పారు. నవంబర్ 1 ఉదయం 6 గంటల నుంచి డిసెంబర్ 1 ఉదయం 6 గంటల వరకు ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు నిర్వహించరాదని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమాల కోసం ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు.




# మొంథా తుఫాను ప్రభావ వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**కేంద్ర ప్రభుత్వం తమవంతు ఆర్థిక సహాయాన్ని అందించాలని,జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందాలను పంపాలని కోరిన ఎమ్మెల్యే నాయిని**

**జై భీమ్ న్యూస్ (హన్మకొండ)**

హన్మకొండ నగరంలో మొంథా తుఫాను కారణంగా సంభవించిన నష్టం వర్ధనానికమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. సుమారు 100కు పైగా కాలనీలు జలమయమై, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు కుటుంబాలతో సహా నీటిలో చిక్కుకుపోయిన ఈ క్లిష్ట పరిస్థితుల్లో యస్.డి.ఆర్.ఎఫ్ బృందాలు రాత్రింబగళ్ళు సహాయక చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ, నీటి మట్టం ఎక్కువగా ఉండటం వల్ల పూర్తి స్థాయి సహాయం అందించడం కష్టంగా మారిందన్నారు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హన్మకొండకు చేరుకుని ముంపుకు గురైన కాలనీలను పరిశీలించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విన్నారని ఆయన తెలిపారు. ముంపు ప్రభావిత కుటుంబాల పునరావాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించనున్నదని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే, అన్ని శాఖల అధికారులను క్షేత్ర స్థాయిలో దింపి తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని వెల్లడించారు. నాయిని రాజేందర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ %-% హన్మకొండలో పోటుచేసుకున్న ఈ భారీ విపత్తును ప్రత్యేక దృష్టితో పరిగణించి, కేంద్ర బృందాలను పంపి నష్టాన్ని అంచనా వేసి, ప్రధానమంత్రి సహాయ నిధి నుండి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లను, ఆస్తులను కోల్పోయిన పేద ప్రజానీకాన్ని ఆదుకోవడం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.ప్రజలు ఈ క్లిష్ట సమయంలో ధైర్యం కోల్పోకూడదని, రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అన్ని రకాల సహాయక చర్యలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కాలనీల్లోని యువత, విద్యార్థులు ప్రభుత్వం చేపడుతున్న సహాయక కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొని, తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.



# నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ, నవంబర్ 2( జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం (3-11-2025) న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వివిధ శాఖల అధికారులు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు, నష్టపరిస్థితుల అంచనా సర్వేలో పాల్గొంటున్నందున ఈ వారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం సాధ్యం కాలేదని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు.

# ఎర్రగట్టుగుట్ట పద్మశాలి సంఘం కొత్త కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక









**హసన్ పర్తి, నవంబర్ 2(జై భీమ్ న్యూస్)**

ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలోని పద్మశాలి కులస్తులు ఆదివారం ఎర్రగట్టుగుట్ట ఆవరణలో సమావేశమై ఎర్రగట్టుగుట్ట పద్మశాలి సంఘం కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ సమావేశం సంఘం వ్యవస్థాపకులు విడపు ప్రతాప్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా జరిగింది. సమావేశంలో సంఘం కార్యకలాపాలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించగా, అనంతరం నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో మాటేటి రవీందర్ అధ్యక్షుడిగా, పాశికంటి నరేందర్ కార్యదర్శిగా, కుసుకుంట్ల సతీష్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా డైరెక్టర్లుగా మేకం రంజిత్ కుమార్, ఇప్పకాయల మనోహర్, కదారి రమేష్, దాసరి శ్రీనివాస్, మోతే కృష్ణమూర్తిలను ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ౹ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పద్మశాలి బంధువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కుల ఐక్యత, యువత సాధికారత, సామాజిక సేవా కార్యక్రమాలపై మరింత దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు విడపు ప్రతాప్ మాట్లాడుతూ ౹ సమాజ అభివృద్ధికి, యువతకు మార్గదర్శకత్వం ఇవ్వడమే ఈ సంఘం ప్రధాన లక్ష్యం. సమైక్యతతో ముందుకు సాగితే ఎర్రగట్టుగుట్ట పద్మశాలి సంఘం ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో కుల బంధువులు, యువత పాల్గొన్నారు. కొత్త కమిటీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సభ్యులు పూలమాలలు వేసి అభినందించారు.

# కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలిసి పత్తి,మొక్కజొన్న ,ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**వరంగల్/నెక్కొండ(జై భీమ్ న్యూస్)**

నెక్కొండవ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఆదివారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలిసి పత్తి,మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు వారు కోరుకున్న రోజే స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తి తీసుకువస్తే కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అదే విధంగా ధ్యానం, మొక్కజొన్న రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులను,వ్యాపారులను ఆదేశించారు. రైతులు కూడా తేమ శాతం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకొని తీసుకురావాలని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని రైతులను కోరారు కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంట వివరాలను క్షేత్రస్థాయిలో అధికారులు నమోదు చేస్తున్నారని, పంట నష్టపోయిన రైతులు అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ రాంరెడ్డి,ఆర్డీవో ఉమారాణి , డీసీఓ నీరజ ,డీఎం సివిల్ సప్లయర్ సంధ్యారాణి , డీసీఎస్ఓ కిష్టయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, మార్కెట్ ఛైర్మన్లు పాలాయి శ్రీనివాస్, హరీశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# గెలిపే లక్ష్యంగా జూబ్లీహిల్స్ లో దూసుకుపోతున్న కాంగ్రెస్





**జై భీమ్ న్యూస్ (హైదరాబాద్)**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఉదయం రహమత్ నగర్ డివిజన్ లోని శ్రీరామ్ నగర్, సంధ్య నగర్, కార్మిక నగర్, వినాయక నగర్, ఎస్.పి.ఆర్ హిల్స్ లో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, చిరు వ్యాపారులు, షాపుల యజమానులను ప్రత్యక్షంగా కలిశాను. సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరుపై ప్రజలలో మంచి స్పందన కనిపించింది అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నవీన్ యాదవ్ ని గెలిపించి, పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వాన్ని దీవించాలని కోరడం జరిగింది అని మంత్రి తెలిపారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో బోరబండ డివిజన్‌లో బూత్ ఇంచార్జులు, ముఖ్య కార్యకర్తల సమావేశం

**జై భీమ్ న్యూస్ (హైదరాబాద్)**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల ప్రణాళికలో భాగంగా బోరబండ డివిజన్ ఇంచార్జ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బూత్ ఇంచార్జులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో ప్రతి ఓటరుతో వ్యక్తిగతంగా మమేకం కావడం, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కట్టుబడి ఉండే విధంగా పార్టీ తరఫున చైతన్యం కల్పించాలని సూచించారు. అలాగే, ప్రతి బూత్ స్థాయిలో ఓటర్లతో నిత్య ప్రచారం కొనసాగిస్తూ, పార్టీ అభ్యర్థి విజయానికి సమిష్టి కృషి చేయాలని బూత్ ఇంచార్జులు మరియు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల నమ్మకం సంపాదించడమే విజయానికి మార్గమని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ స్థానికుడు,యువనేత నిత్యం ప్రజల శ్రేయస్సు కోరుకునే వ్యక్తి అని ఆయన పేర్కొన్నారు.నవీన్ యాదవ్ గెలుపు జూబ్లీహిల్స్ అభివృద్ధికి ఒక మైలురాయి అని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్యాస్ లీక్‌తో చెలరేగిన మంటలు.. తప్పిన పెను ప్రమాదం


**ఇంటి యజమాని చాకచక్యంతో పెద్ద ప్రమాదం తప్పింది౹ ఇద్దరికీ తీవ్ర గాయాలు**
**మెరుగైన చికిత్స కోసం హనుమకొండకు తరలింపు**

**జనగామ జిల్లా జై భీమ్ న్యూస్**

పాలకుర్తి మండల కేంద్రంలో ఆదివారం ఉదయం గ్యాస్ లీక్ కారణంగా మంటలు చెలరేగి పెద్ద ప్రమాదం తప్పిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇంటి యజమాని చిదిరాల నర్సయ్య, చిన్నారి చిదిరాల రిషిక తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే కొడకండ్లకు చెందిన యాకూబ్ సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా నర్సయ్య కుటుంబానికి భారత్ గ్యాస్ కనెక్షన్ ఉంది. ఇటీవల గ్యాస్ మొద్దు పిన్ను సరిగా పనిచేయకపోవడంతో శనివారం కొత్త గ్యాస్ మొద్దును అమర్చారు. అయితే, రెగ్యులేటర్ అమర్చిన కొద్ది సేపట్లోనే గ్యాస్ వాసన వస్తుండటాన్ని గమనించిన నర్సయ్య వెంటనే గ్యాస్‌ను ఆఫ్ చేయడానికి ప్రయత్నించారు. అయితే ఆ సమయంలో పక్కనే ఉన్న దేవుని గుడిలో దీపం వెలగడంతో లీకైన గ్యాస్ ఒక్కసారిగా అంటుకొని మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన నర్సయ్య చాకచక్యంగా స్పందించి మంటలు అంటుకున్న గ్యాస్ మొద్దును బయటకు విసరడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే మంటల్లో ఆయనతో పాటు చిన్నారి రిషిక తీవ్రంగా కాలిపోయారు. తక్షణమే వారిని పాలకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల ప్రకారం ఇద్దరికీ సుమారు 40 శాతం కాలిన గాయాలు ఉన్నాయని తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీలు కస్టమర్లకు మొద్దులు అందజేసే ముందు పిన్ను సక్రమంగా పనిచేస్తుందా లేదా అని తనిఖీ చేయడం లేదు. ఇలాంటి నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుర్తి పోలీసులు ఈ ఘటనపై విచారణ ప్రారంభించగా, స్థానికులు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.






# అచ్చియమ్మ'గా జాన్వీ కపూర్... రామ్ చరణ్ 'పెద్ది' నుంచి ఫస్ట్ లుక్ విడుదల!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నుంచి మేకర్స్ ఓ కీలక అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ను, ఆమె పాత్ర పేరును అధికారికంగా పరిచయం చేశారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో కనిపించనుంది. విడుదల చేసిన పోస్టర్‌లో ఆమె డీగ్లామర్ లుక్‌లో ఆకట్టుకుంటోంది. "పెద్ది ప్రేమించే ఫైర్‌బ్రాండ్ ఆటిట్యూడ్ ఉన్న అమ్మాయి అచ్చియమ్మ" అంటూ చిత్రబృందం ఆమె పాత్రను అభిమానులకు పరిచయం చేసింది. ఈ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. జాన్వీ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా, కథలో కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ చిత్రాన్ని 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.

# నేను చదువుకోలేదు.. డాన్స్ మాత్రమే తెలుసు లుంగీ మామ!

యూ ట్యూబ్ ను ఎక్కువగా చూసేవారికి 'లుంగీ మామ' గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. లుంగీ పైకి కట్టి .. చెప్పులతో .. రోడ్డు పక్కనే ఆయన వేసే స్టెప్స్ ను చాలామంది ఇష్టపడుతూ ఉంటారు. ఆయన గురించి తెలుగుకోవాలనే ఆసక్తి కూడా చాలామందికి ఉండేది. అలాంటి ఆయన హఠాత్తుగా మొన్న వచ్చిన 'కె ర్యాంప్' సినిమాలో, కిరణ్ అబ్బవరంతో కలిసి స్టెప్పులు వేశాడు. అలాంటి లుంగీమామ తాజాగా సుమన్ టీవీకి ఇంటర్వ్యూ ఇచ్చాడు. " నా అసలు పేరు వెంకట రమణ. మాది నెల్లూరు జిల్లా లోని ఒక మారుమూల గ్రామం. నేను స్కూలుకి వెళ్లింది లేదు .. చదువుకున్నదీ లేదు. మాది మత్స్య కారుల కుటుంబం. అందరం సముద్రంపై ఆధారపడేవాళ్లమే. చిన్నప్పటి నుంచే మా బాబాయ్ తో కలిసి చేపల వేటకి వెళ్లేవాడిని. మా బాబాయ్ 'గోవింద్' కారణంగానే నాకు డాన్స్ పట్ల ఆసక్తి ఏర్పడింది. పాట వినిపిస్తే చాలు డాన్స్ చేస్తాడని మా ఊళ్లో చెప్పుకునేవారు" అని అన్నాడు. " మా ఊరికి చెందిన మున్నా - నరేందర్ కలిసి రీల్స్ చేసేవాళ్లు. ఒకరోజున వాళ్లు వచ్చి వీడియోస్ చేద్దామని అన్నారు. అలా చేసిన ఫస్టు సాంగ్ కి 4 మిలియన్స్ వ్యూస్ వచ్చింది. సాంగ్స్ దాదాపు నేనే సెలెక్ట్ చేస్తాను. ఎడిటింగ్ .. అప్ లోడ్ చేయడం అంతా కూడా మున్నా చూసుకుంటాడు. 'కె ర్యాంప్' సినిమా మాకు మరింత గుర్తింపు తెచ్చింది. ఆ పాటను మేమే కంపోజ్ చేసుకున్నాం. తెరపై కనిపించడం చాలా సంతోషంగా అనిపించింది" అని చెప్పాడు.





# 52 ఏళ్ల వయసులోనూ చెక్కుచెదరని ఐశ్వర్య అందం.. అసలు రహస్యం ఇదే!

సౌందర్యరాశి ఐశ్వర్య రాయ్ బచ్చన్... ఈ పేరు వినగానే అందం, హుందాతనం గుర్తుకొస్తాయి. 1994లో ప్రపంచ సుందరి కిరీటం గెలుచుకున్న నాటి నుంచి నేటి వరకు, ఆమె గ్రేస్ ఏమాత్రం తగ్గలేదు. ఈరోజు (నవంబర్ 1) తన 52వ పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా, దశాబ్దాలుగా చెక్కుచెదరని ఆమె సౌందర్య రహస్యాలపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఒక నటిగా, తల్లిగా, గ్లోబల్ ఐకాన్‌గా బహుళ పాత్రలు పోషించే ఐశ్వర్య తన దినచర్య గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "సాధారణంగా అందరికీ రోజుకు 24 గంటలుంటే, నేను మాత్రం 48 గంటల పనిని అందులో పూర్తి చేయాల్సి ఉంటుంది" అని ఆమె గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. తన రోజు ప్రతిరోజూ ఉదయం 5:30 గంటలకే మొదలవుతుందని చెప్పారు. ఇంత బిజీ షెడ్యూల్‌లోనూ ఆమె అందం ఎలా మెరిసిపోతుందని చాలామంది ఆశ్చర్యపోతుంటారు. అయితే, దీని వెనుక పెద్దగా ఖరీదైన ఉత్పత్తులు గానీ, సుదీర్ఘమైన స్కిన్‌కేర్ రొటీన్లు గానీ లేవని ఐశ్వర్య స్పష్టం చేశారు. "ప్రతి మహిళలాగే నేనూ సమయంతో పోటీ పడుతుంటాను. నా దృష్టిలో అందంగా కనిపించడానికి ముఖ్యమైనవి రెండే. ఒకటి శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం, రెండోది పరిశుభ్రంగా ఉండటం" అని ఆమె వివరించారు. ఈ రెండూ పాటిస్తే చర్మం దానంతట అదే ఆరోగ్యంగా కనిపిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. దీంతో పాటు, మాయిశ్చరైజింగ్ తన జీవితంలో ఒక భాగమైపోయిందని ఐశ్వర్య తెలిపారు. "సినిమా రంగంలోకి అడుగుపెట్టిన తొలినాళ్ల నుంచే మాయిశ్చరైజింగ్ చేయడం అలవాటైంది. అది ఇప్పుడు నా దినచర్యలో సహజమైన భాగం. రోజు మొదట్లో, ముగింపులో తప్పనిసరిగా మాయిశ్చరైజర్ వాడతాను" అని ఆమె పేర్కొన్నారు. 52 ఏళ్ల వయసులో కూడా ఐశ్వర్య తనదైన శైలిలో అందానికి కొత్త నిర్వచనం ఇస్తున్నారు. సింప్లిసిటీ, స్వీయ సంరక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే వయసుతో సంబంధం లేకుండా ప్రకాశవంతంగా కనిపించవచ్చని ఆమె నిరూపిస్తున్నారు.